# 'భారతదేశంలో ప్రస్తుత వ్యవస్థను మార్చడానికి పోరాడుతున్న శక్తులు - ఎదుర్కొంటున్న సవాళ్ళు' అనే అంశంపై నేషనల్ సెమినార్-రిపోర్టు

**2018** సెప్టెంబర్ 9, 10 తేదీలలో హైదరాబాద్ – వివిఎస్‌టి ఫంక్షన్‌హాల్‌లో సిపిఐ(ఎం–ఎల్) కేంద్రకమిటీ ఆధ్వర్యంలో నేషనల్ సెమినార్ జరిగింది. ఈ సెమినార్‌లో పాల్గొని, సెమినార్ కీలకాంశమైన 'భారతదేశంలో ప్రస్తుత వ్యవస్థను మార్చడానికి పోరాడుతున్న శక్తులు – ఎదుర్కొంటున్న సవాళ్ళు'పై వారి వారి అవగాహనలతో పత్రాలను సమర్పించాల్సిందిగా అనేక వామపక్ష, కమ్యూనిస్టుపార్టీలను సిపిఐ(ఎం–ఎల్) కేంద్రకమిటీ ఆహ్వానించింది. ఆ మేరకు సిపిఐ, ఎంసిపిఐ(యు), సిపిఐ(ఎం–ఎల్)ఎన్‌డి, పిసిసి–సిపిఐ(ఎం–ఎల్), సిపిఐ(ఎం–ఎల్)ఎన్‌డి అనే ఈ ఆరు సంస్థలు సెమినార్‌లో పాల్గొని తమ అభిప్రాయాలతో పత్రాలను సమర్పించాయి.

ఒడిసా, తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, బిహార్, ఝార్ఖండ్, మహారాష్ట్ర, యుపి, న్యూఢిల్లీలతో పాటుగా ప్రధానంగా తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలనుండి దాదాపు 500 మంది ప్రతినిధులు ఈ రెండురోజుల సెమినార్‌లో గంభీర వాతావరణంలో వివిధ సంస్థల అభిప్రాయాలను ఆసాంతం విని చర్చలలో పాల్గొన్నారు.

సిపిఐ(ఎం–ఎల్) కేంద్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు కామ్రేడ్స్ అలోక్ ముఖర్జీ, మధు, సుశీలన్‌లు ఈ సెమినార్‌కు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. తొలుత సిపిఐ(ఎం–ఎల్) కేంద్రకమిటీ సభ్యులు కా॥యస్.ఝాన్సీ భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల్లో భారత సమాజ మార్పుకోసం అశువులు బాసిన వారందరికీ జోహార్లు అర్పిస్తూ సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ప్రతినిధులంతా లేచి నిలబడి రెండు నిమిషాలు మౌనం పాటించి, అమరులకు నివాళులర్పించారు. సిపిఐ(ఎం–ఎల్) సిసిఎమ్ కా॥గుర్రం విజయకుమార్ ప్రతినిధులందరనూ ఆహ్వానిస్తూ, సెమినార్ నేపథ్యాన్ని దృష్టికి తెచ్చారు.

సిపిఐ(ఎం–ఎల్) సిఇసిఎమ్ కా॥ పి.జస్వంతరావు తొలుత స్వాగతోపన్యాసం చేస్తూ వివిధ రాష్ట్రాలనుండి హాజరైన ప్రతినిధులకు, ప్రత్యేకించి సెమినార్‌లో పాల్గొంటున్న వివిధ వామపక్ష, కమ్యూనిస్టు పార్టీల బృందాలకు విప్లవాభినందనలు తెలిపారు.

ప్రస్తుత వ్యవస్థ మార్పుకోసం పోరాడుతున్న అన్ని శక్తుల నడుమ ఓ చర్చను ప్రారంభించటంద్వారా మనమెదుర్కొంటున్న సవాళ్ళను, సమస్యలను గుర్తించి, వాటిని ఎదుర్కొనే ప్రయత్నాలను సమన్వయంచేసే ఓ ఉమ్మడి కృషి సాగించేందుకు సిపిఐ(ఎం–ఎల్) కేంద్రకమిటీ ఈ చొరవ తీసుకుందని కామ్రేడ్ జస్వంతరావు వివరించారు. ఈ లక్ష్యంతోనే సిపిఐ(ఎం–ఎల్) కేంద్రకమిటీ ఈ సెమినార్‌లో చర్చలను సౌలభ్యంగా సాగించేందుకు వీలుగా కీనోట్‌ను రూపొందించిందని చెపుతూ, ప్రతినిధులంతా స్వేచ్ఛగా, వస్తుగతంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలని కోరారు. ఇది కేవలం ఓ ప్రారంభం మాత్రమేనని, సాధారణాంశాలను కనుకొనేందుకు వీలైన అన్ని పద్ధతుల్లోనూ భవిష్యత్తులో ఈ ప్రయత్నాలు తప్పక కొనసాగుతాయని చెపుతూ ఆయన ముగించారు.

సిపిఐ(ఎం–ఎల్) సిఇసిఎమ్ కా॥అరవిందసిన్హా, సిపిఐ(ఎం–ఎల్) కేంద్రకమిటీ తరఫున సెమినార్‌లో కీనోట్‌ను ప్రవేశపెడుతూ వివరించారు. పెట్టుబడిదారీవిధానం కోలుకోలేనంత సంక్షోభంలో కూరుకుపోయిందని, దాని దుష్ఫలితాలు ప్రపంచవ్యాపితంగానూ, భారతదేశంలోనూ ప్రజానీకంపై ఏవిధంగా పడుతున్నాయో ఆయన వివరించారు. భారత పాలకవర్గాలు ప్రజలపై సాగిస్తున్న దమనకాండను, తీవ్ర హిందూ మతతత్వ రూపంలో ప్రజలపై పెరుగుతున్న ఫాశిస్టు తరహా దాడులను ఆయన పేర్కొన్నారు.

సిపిఐ ప్రధాన కార్యదర్శి కా॥ సురవరం సుధాకరరెడ్డి సెమినార్‌కు హాజరుకాలేకపోయినందున వారి తరఫున కా॥ వి.రామనరసింహారావు ఆ పత్రాన్ని సెమినార్‌లో ప్రవేశపెట్టారు.

ఎంసిపిఐ(యు) ప్రధాన కార్యదర్శి కా॥ ఎం.డి.గౌస్ క్లుప్తంగా వారి పత్రాన్ని ప్రవేశపెడుతూ వివరించారు.

సిపిఐ(ఎం–ఎల్)ఎన్‌డి కేంద్రకమిటీ తరఫున కా॥ వై.సాంబశివరావు సెమినార్‌లో పత్రాన్ని ప్రవేశపెట్టారు.

సిపిఐ(ఎం–ఎల్)ఎన్‌డి ప్రధాన కార్యదర్శి కా॥ చంద్రం తరఫున కా॥ ఎస్. వెంకటేశ్వరరావు సెమినార్‌లో పత్రాన్ని ప్రవేశపెట్టారు.

సిపిఐ(ఎం–ఎల్) రెడ్‌స్టార్ ప్రతినిధి బృందం కూడా సెమినార్‌కు ఓ పత్రంతో హాజరయ్యారు. ఆ పత్రంలోని విషయాలు సెమినార్ అంశానికి సంబంధించి లేకపోవటంతో, సెమినార్ కేంద్ర అంశంపై మాట్లాడ వలసిందిగా వారి బృంద నాయకుని అధ్యక్షవర్గం కోరింది. ఆపై కా॥ హరిప్రసాద్ ఆ పత్రంలోని కొన్ని భాగాలను ప్రతినిధుల ఎదుట చదివారు.

పిసిసి, సిపిఐ(ఎం–ఎల్) తరఫున కా॥ ధ్రువనారాయణ్ సెమినార్ అంశంపై మాట్లాడారు. సెమినార్ అంశాన్ని, సెమినార్ నిర్వహణకు తీసుకొన్న చొరవను ఆయన అభినందించారు; ఐక్య కార్యాచరణకు కొన్ని అంశాలను ఆయన సూచించారు.

ప్రముఖ విప్లవ కవి కా॥ నిఖిలేశ్వర్ తన ప్రసంగంలో సెమినార్ నిర్వాహకుల చొరవను అభినందించారు. పాలకవర్గాల అణచివేత, దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాటంలో అన్ని శక్తులనూ కలుపుకొచ్చే దిశగా ఇలాంటి ప్రయత్నాలు భవిష్యత్తులోనూ కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు.

ప్రజల జీవితాల్లో చెలగాటమాడుతున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలపై కూడా ఈ సెమినార్ దృష్టిసారించాలని ప్రజాతంత్ర మేధావి దేవభక్తుని పాపారావు తన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు.

కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలోని కొన్ని ఘట్టాలను కా॥ హర్షతక్కర్ వివరించి, ప్రస్తుత పరిస్థితినుండి బయటపడే మార్గం గురించి చర్చించ వలసిందిగా ప్రతినిధులను కోరారు.

సెమినార్‌లో పాల్గొన్న సంస్థలు తమతమ పత్రాలను సమర్పించి, వివరించిన తర్వాత, సందేహాలు - జవాబుల సెషన్ జరిగింది. హాల్‌లో ప్రతినిధులకు - అధ్యక్షవర్గానికి నడుమ సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి సభ్యులు కా॥ ప్రసాదన్న సమన్వయం చేశారు. ప్రతినిధులు అడిగిన ప్రశ్నలపై ఆయా పత్రాలు సమర్పించిన సంస్థల నాయకులు మాట్లాడుతూ జవాబులు లేదా వివరణలు అందించారు. ఈ విధంగా రెండవరోజు కూడా ఈ సెషన్ కొనసాగింది. ప్రతినిధులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయటంతోపాటుగా ఉద్యమం ఎదుర్కొంటున్న సమస్యలను పేర్కొన్నారు.

కామ్రేడ్ అరవిందసిన్హా ముగింపు ఉపన్యాసంచేస్తూ, ఈ సెమినార్ నిర్వహించటం వినమ్రంగా తాము చేసిన ఓ ప్రారంభం మాత్రమేనని పేర్కొన్నారు. వివిధ సంస్థల నాయకత్వం కలసి కూర్చుని, ఉద్యమం ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించుకోవలసి వుందన్నారు. దీనికి చాలా సహనం, సంయమన వైఖరులతోపాటు అధిక సమయం కేటాయించాల్సిన అవసరముంటుందన్నారు. ఈ ప్రయత్నాన్ని కొనసాగించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. సభ ముగింపులో ప్రతినిధులందరూ లేచి నిల్చొని అంతర్జాతీయ శ్రామికగీతం ఆలపించారు.

oooooo